# 'వైద్యో నారాయణో హరి'

## కాకాని కమల

"డాక్టర్! అర్జంట్ కేస్" అంటు నర్స్ పరుగెత్తుకుని రావటంతో తన కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చుని ఫోన్ మాట్లాడుతున్న డా.నందకుమార్ ఫోన్ క్రెడిల్ చేసి హడావుడిగా ఇవతలికి వచ్చాడు.

విజిటర్స్ కూర్చునే హాల్లో ఎదురుగా బెంచి మీద ఓ ఐదు సంవత్సరాల వయసున్న కుర్రాడు కడుపు బిగపట్టుకుని మెలికలు తిరుగుతూ బాధతో కేకలు పెడుతున్నాడు.

ఆ కుర్రాడ్ని పట్టుకుని తల్లి కాబోలు — బొట బొటా కన్నీళ్లు కారుస్తూ నిల్చుని వుంది.

ఆమెని చూడగానే చాలా మర్యాదస్తుల కుటుంబానికి చెందిన స్త్రీ అని, బాగా ధనవంతురాలని చెప్పకనే తెలుస్తోంది.

ఖరీదైన సిల్కుచీర, చేతికి, మెడలో బంగారు ఆభరణాలు లైటు కాంతిలో మెరుస్తున్నాయి. మనిషి కూడా పచ్చగా పసుపు రాసినట్లు, పెద్ద పెద్ద కళ్ళతో, ఒత్తుగ తల కట్టుతో సహజ సౌందర్యంగా వుంది.

"ఆ అందానికి ఆ నగలు ఆ చీర మెరుగులు దిద్దుతున్నాయి. ఆగర్భ శ్రీమంతురాలై వుంటుంది" అనుకున్నాడా మొదటి చూపులోనే. ముఖ్యంగా నా నర్సింగ్‌హోమ్ డబ్బున్న వాళ్ళకే అందుబాటులో వుంటుందన్న వదంతు ఒకటుంది. నిజం కూడా అంతే కావచ్చు. కాని మృత్యువు ఒడిలోకి జారిపోయిన ప్రాణికూడా, ఆ ఆఖరి ఘడియల్లో నా ఆస్పత్రిలో చికిత్స పొందితే సంపూర్ణ ఆరోగ్యంతో నవ్వుతూ ఇంటికి వెళ్ళి పోతాడని, నేను అపర "ధన్వంతరి" అన్నది కూడా జనవాక్కు.

"డాక్టర్! ఆ కుర్రాడికి కడుపు నొప్పట!" అంది నర్స్ గాభరాగా.

డాక్టర్ నందకుమార్ ఆ కుర్రవాడి నాడి పట్టుకుని కడుపు మీద తన అరచేత్తో సున్నితంగా ఒత్తుతూ "ఏమిటి కంప్లైంట్?" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

ఆ యువతి దుఃఖాన్ని ఆపుకుంటు "అరగంట నుంచి కడుపులో నొప్పి అంటు బాధతో ఇలా మెలికలు తిరిగిపోతున్నాడు డాక్టర్ గారూ. ఇంతకు ముందు కూడా రెండు మూడు సార్లు కడుపు నొప్పి అని ఏడిచాడు. అపిండిసైటిస్ సంబంధం అని ఆపరేషన్ చెయ్యాల్సి వస్తుందని డాక్టర్లు చెప్పారు. తాత్కాలికంగా ఏవో మందులు ఇచ్చారు. తగ్గింది. కానీ ఇప్పుడు వచ్చినంత సీరియస్‌గా ఇంతకు ముందు రాలేదు" అంది చేతి రుమాలతో కన్నీరు అదముకుంటూ.

నందకుమార్ స్టెతస్కోప్ తో ఆ కుర్రవాడ్ని వేగంగా పరీక్ష చేస్తూ—

"అవును కండిషన్ సీరియస్‌గా ఉంది. అపెండిసైటిస్ ఆపరేషన్ వెంటనే జరగాలి. లేకపోతే ప్రాణానికే ముప్పు" అన్నాడు ఆ యువతి కేసి చూస్తూ.

ఆమె కన్నీటితో రెండు చేతులు జోడించింది. "నా పేరు అంజని. మాది ఈ ఊరు కాదు డాక్టర్. ఇక్కడ మా అన్నయ్య ఇంటికి వచ్చాను. అన్నయ్య ఒదిన అనుకోని పరిస్థితిలో హఠాత్తుగా చిన్న ఊరికి వెళ్ళవలసి వచ్చింది. మా ఒదిన తల్లికి "హార్టు అటాక్" వచ్చిందని సీరియస్ అని టెలిగ్రాం వస్తే అన్నయ్య ఒదిన కారులో వెళ్ళారు. అన్నయ్య రేపు వచ్చేస్తాడు. ప్రస్తుతం నేను ఒక్కర్తినే. ఇంట్లో వున్నాను. వీడికి ఇలాగ అయ్యింది. నాకు ఈ ఊరు కొత్త. మా ఒదిన తరచు మాటల మధ్య మీ నర్సింగ్ హోమ్ గురించి చెప్తూ వుంటుంది. మీరు మా అన్నయ్య వాళ్ళ ఫామిలీ డాక్టరట కదా. ఆ విషయం జ్ఞాపకం వుంచుకొని బాబుని ధైర్యంగా ఇక్కడికి తీసుకువచ్చాను. అన్నయ్య వాళ్ళవంటావిడ కూడా మీ దగ్గరికి తీసుకెళ్ళమని చెప్పింది. సమయానికి చేతులో కారు కూడా లేదు. అన్నయ్య ఒదిన తీసుకెళ్ళారు. టాక్సీలో వచ్చాను" అంది.

నందకుమార్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఇంతకి మీ అన్నయ్య ఎవరు?" అన్నాడు.

"అఖిల ఇండస్ట్రీస్ ప్రొప్రయిటర్ రాంగోపాల్" అంది.

"ఓహ్! బిజినెస్ మాగ్నెట్ రాంగోపాల్ సిస్టరా మీరు. వెరిగుడ్ ఆ మాట ముందే చెప్పారు కాదే" అన్నాడు ఉత్సాహంగా. (ఆమెని చూడగానే అనుకున్నాడు శ్రీమంతుల ఇంటి ఆడపడుచని. తన అంచనా తప్పు కాలేదు అనుకున్నాడు మనసులో సంతృప్తిగా. రూపాయి వెయ్యవలసిన చోట పది రూపాయలు వేసినా తన ఫీజు ఎక్కడికి పోదు.)

"................."

"చూడండి. మీ అబ్బాయికి అపెండిసైటిస్. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. మీతో ఎవరు వచ్చారు?"

"ఒక్కర్తినే వచ్చాను డాక్టర్. మాది కాకినాడ. మా వారు ఇంజనీర్‌గా అక్కడ పనిచేస్తారు. అన్నయ్యని చూద్దామని పిల్లల్ని తీసుకుని నేను వచ్చాను. ఇంట్లో కూడా వంటావిడ పని కుర్రాడు తప్పించి ఎవ్వరూ లేరు. నాకు వీడి తరవాత ఒక పాప. వంటావిడికి మా పాపని, అన్నయ్య పిల్లలిద్దర్ని అప్పజెప్పి నేను ఒక్కర్తినే వచ్చాను" అంది.

రాంగోపాల్ పిల్లలిద్దరూ కూడా చాలా చిన్న పిల్లలు. ఆ విషయం నందకుమార్‌కి తెలుసు.

"అలాగా! మరేం ఫరవాలేదులెండి. రాంగోపాల్ నా క్లోజ్ ఫ్రెండ్. మీ బాబుని క్షేమంగా మీకు అప్పగించే బాధ్యత నాది. మీరు ఇక్కడ సంతకం చెయ్యండి" అంటు కొన్ని కాగితాలు అందించాడు.

ఆపరేషన్‌కి అంగీకరిస్తూ రాసిన పత్రం అది.

"డాక్టర్! ఆపరేషన్ థియేటర్ సిద్ధం అయ్యింది" అంటు నర్స్ వచ్చింది.

అప్పటికి రాత్రి ఎనిమిది దాటుతుంది. బయట చీకటి క్రమంగా చిక్కబడుతోంది. నర్సింగ్ హోమ్ లోపల మాత్రం తళతళ మెరిసిపోయే మెర్క్యూరి దీపాలతో ఎయిర్ కండిషన్‌తో, తెల్లటి పాలరాతి గచ్చుతో నక్షత్రాలు ఆసుపత్రికి దీటుగా ఉంది.

అంజని సంతకం చెయ్యడానికి కాగితం తీసుకొని

"ఒ.కె. మీ అబ్బాయికి ఆపరేషన్ చేస్తాం.

కాంప్లికేషన్స్ ఏమీ లేకపోతే రేపు ఇంటికి తీసుకెళ్ళిపోవచ్చు'' అన్నాడు కుర్చీలోంచి లేస్తూ

అంజని సందేహంగా ''డాక్టర్! ఒక చిన్న రిక్వెస్టు'' అంది అభ్యర్థనగా.

''ఎస్....''

''అన్నయ్య రేపు ఈ పాటికి గాని లేక ఎల్లుండి ఉదయం కాని వస్తాడు. అన్నయ్య రాగానే మీ బిల్లు పే ఛేస్తాను. వీలవుతుందా?''

నందకుమార్ చిన్నగా నవ్వాడు.

''ఇప్పుడు మీరు ఇచ్చినా తీసుకోను. నేను రాంగోపాల్ దగ్గరే తీసుకొంటాను. నేను వాళ్ళ ఫ్యామిలి డాక్టర్ని. తరచు వాళ్ళింటికి నేను వెదుతూనే వుంటాను. ఏవో పిల్లలకి కంప్లెయింట్స్ మెడికల్ చెకప్స్ వుంటూనే వుంటాయి. రాంగోపాల్ మిసెస్‌కి బి.పి. కంప్లెయింట్స్ వున్నాయి కదా. అందుకే రెగ్యులర్ చెకింగ్ వుంటుంది. నాలుగైదు నెల్లకొకసారి బిల్ ఇస్తాను. చెక్ రూపంలో ఇస్తారు. పైగా మీరు ఆయన సిస్టర్. మీరు ఇప్పుడు ఇచ్చినా మాత్రం మీ దగ్గర నేను ఎలా తీసుకొంటాననుకున్నారు?'' అన్నాడు నవ్వుతూ.

''థ్యాంక్యూ'' అంది అంజని రిలాక్స్ అవుతూ.

దాదాపు రెండున్నర గంటల తరువాత బాబుని బెడ్‌మీద పడుకోబెట్టింది నర్స్.

బాబుకి ప్రాణాపాయం తప్పిపోయింది.

పెద్ద నర్సింగ్ హోమ్ మంచి డాక్టరు చేత ఆపరేషన్ జరిగింది. ఇంక తన బిడ్డకేం భయం లేదు అనుకుంటే అంజనికి ఆనందంతో కళ్ళు తడిశాయ్.

ఆరాత్రంతా బిడ్డని తనివి తీరా చూసుకుంటూ మంచం పక్కనే కూర్చుండిపోయింది.

ఆ మర్నాడు ఉదయం ఒక చిన్న బుట్టనిండా ఆపిల్ పళ్ళు గులాబీలు ఒక మ్యూజికల్ గ్రీటింగ్ డాక్టరు గారికి అందించింది.

''వీడు నాకు ఆరో ప్రాణం. వీడు లేందే నేను జీవించలేను. సమయానికి మీరు వాడికి ప్రాణం పోశారు. నిజంగా మీ ఋణం తీర్చుకోలేనిది'' అంది. ఒంగి నందకుమార్‌కి పాదాభివందనం చేస్తూ.

ఆమె వేళ్ళ నుంచి జారిన రెండు కన్నీటి చుక్కలు డాక్టరు గారి పాదాల్ని తడిపాయి.

ఇది నందకుమార్‌కి కొత్త అనుభూతి కాదు. అతనికి అలవాటు దాదాపు నిత్య అనుభవం.

ఎంత ధనవంతులైనా ఎంత పొజిషన్‌లో వున్న వాళ్ళు అయినా తమ వారికి స్వస్థత చేకూరి ఇంటికి తీసుకొని వెళుతున్నప్పుడు వేలకి వేలు ఫీజు చెల్లించినా కృతజ్ఞతలు కూడా ఇంత ఉన్నతంగానూ ఉంటాయి.

''బాబూ! డాక్టరు గారికి నమస్కారం చెయ్యి'' అంది కొడుకు రెండు చేతులు పట్టుకొని తనే జోడిస్తూ.

నీరసంగా నవ్వుతూ బాబు నమస్కారం చేశాడు.

''డాక్టరుగారూ! మా బాబుకి మీరు ప్రాణం ఇచ్చారు'' అంది నీళ్ళు నిండిన కళ్ళతో.

డా.నందకుమార్ చిన్నగా మందహాసం చేశాడు.

బుట్టలోంచి ఒక పండు తీసి బాబు చేతిలో పెడుతూ ''మీరు మరీ అంతగా నన్ను పొగడనక్కరలేదు. నా వృత్తి ధర్మం నేను చేశాను. ఆ పనికి కొంత ఫీజు తీసుకుంటున్నాను'' అన్నాడు.

''అన్నయ్య రాంగానే మీకు ఫోన్ చేయిస్తాను. ఇద్దరం కల్సి మళ్ళీ మీ దగ్గరికి వస్తాము'' అంది.

''ఇట్స్ ఆల్ రైట్'' అన్నాడు.



ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది.

కన్సల్టింగ్ అవర్సు.

అప్పటికే అతని కోసం చాలా మంది అవుట్ పేషెంట్స్ వెయిట్ చేస్తున్నారు. అతని సమయం పాడుచెయ్యటం మర్యాదగ ఉండదు.

అంజని బిడ్డని తీసుకుని ఇంటికి వచ్చేసింది.

★ ★ ★

ఉదయం ఎనిమిదిన్నర నుండి రెండు గంటల వరకు, సాయంత్రం నాలుగు నుండి రాత్రి ఏడుగంటల వరకు కన్సల్టింగ్ అవర్సు.

మిగతా సమయంలో బయట వేరే అవుట్ పేషెంట్స్ ఇళ్ళకి విజిటింగ్ కి వెడతాడు. ముఖ్యమైన ఇతర పన్లు చూసుకుంటాడు నందకుమార్. బాగా బిజీ డాక్టరు.

ఐదెకరాల విశాలమైన ఆవరణలో పెద్ద పాష్ నర్సింగ్ హోమ్ ప్రక్కనే డాక్టరు క్వార్టర్సు. పెద్ద కొడుకు ఫారెన్ లో ఎమ్మెస్ చేస్తున్నాడు. తరువాత అమ్మాయి. మెడిసన్ మొదటి సంవత్సరంలో ఉంది. భార్య రైతు కుటుంబంలోంచి వచ్చింది. వంటింటి చిలక.

నందకుమార్ విదేశాల్లో చదువుకుని వచ్చాడు. బాగా డబ్బు మనిషి. కాని మంచి హస్తవాసి గల డాక్టరని అతని చేతిలో మృతసంజీవిని ఉందని చెప్పుకుంటారు.

మధ్యాహ్నం మంచి భోజనం చేసి ఓ గంట సేపు హాయిగా పడుకొని లేచాడు నందకుమార్.

చల్లటి నీళ్ళతో స్నానం చేసి నీట్ గా డ్రెస్ అయ్యాడు. భార్య పెట్టిన లైట్ టిఫిన్ తిని కాఫీ తాగి నెమ్మదిగా కన్సల్టింగ్ రూమ్ లోకి వచ్చాడు.

సాయంత్రం క్రమంగా ఎండ తీవ్రత తగ్గుతోంది. నాలుగు కావటానికి ఇంకా పావుగంట వ్యవధి ఉంది.

కన్సల్టింగ్ రూమ్ లోకి రాగానే టేబుల్ మీద ఫోన్ ప్రక్కగా వున్న చిన్న ట్రేలో, పోస్టలు ముద్రలు స్టాంపులు లేకుండా వున్న ఒక చిన్న బ్రౌన్ కలర్ కవరు అతని దృష్టిని ఆకర్షించింది.

''ఎక్కడిది ఈ ఉత్తరం?'' అన్నాడు అప్పుడే లోపలికి వచ్చిన సిస్టర్ కేసి చూస్తూ.

''ఏమో డాక్టర్. ఎవరో ముసలావిడ ఇందాక గేట్ వాచ్ మెన్ కి ఈ ఉత్తరం ఇచ్చి డాక్టరు గారికి ఇమ్మని చెప్పిందట. వాచ్ మెన్ తెచ్చి నాకిచ్చాడు. నేను మీ బల్లమీద పెట్టినా'' అంది.

''సరే'' అని కవరు చింపుతూ ''పేషెంట్సు చాలా మంది ఉన్నారా?'' అన్నాడు.

''ఉన్నారు డాక్టరు'' అంది.

''సరే. పది నిముషాల తరువాత వరసగా లోపలికి పంపించు'' అంటు కుర్చీలో రిలాక్సింగా వెనక్కి వాలి కవరులోంచి ఉత్తరం బయటికి తీసి కాగితం మడత విప్పాడు.

''దైవ స్వరూపులైన డాక్టరుగారికి

నమస్కారం నా పేరు అరుణ...''

అరుణ? ఎవరీ అరుణ? అనుకుంటు నొసలు చిట్లించి ఉత్తరం చదవటం మొదలు పెట్టాడు.''

నేను మీకు తెలియక పోవచ్చు. కాని ఈ పట్టణంలో ప్రముఖ డాక్టరుగా అపర ధన్వంతరిగా మీరు అందరికి తెలుసు. నేను చాలా పేదరాల్ని. అంతేకాదు. దురదృష్టవంతురాల్ని కూడా. నా పెళ్ళి అయిన ఏడాదికే నా భర్త ఆక్సిడెంట్ లో చనిపోయ్యాడు. బంధువులు ఎవరూ నన్ను ఆదుకోలేదు. నాది నష్టజాతకమని వాళ్ళ కొడుకుని మింగేశానని నా అత్తమామలు నన్ను ఇంట్లోంచి గెంటేశారు. అప్పటికి నాకు ఆరో నెల. ఎలాగో పుట్టింట్లో అన్న ఒదినల పంచన తలదాచుకొని ప్రసవం అయ్యిందనిపించాను. నా కొడుకుని చూసుకున్నాక జీవితంలో ఆశ చిగురించింది. నా జీవన సర్వస్వం వాడే. వాడులేని జీవితం నాకు లేదు.

నేను పెద్దగా చదువుకోలేదు. నేను చదివిన చదువుకి గొప్ప ఉద్యోగాలు రావు. నాకు చిన్నప్పట్నుంచి కళలంటే ఇష్టం. గొప్ప కళాకారిణ్ణి కావాలని ఎన్నో ఆశలు వుండేవి. నా కంఠం బాగుంటుంది. పాటలు పాడతాను. సంగీతం నేర్చుకోలేదు. కాని వినికిడితో సినిమా పాటలు పాడతాను. అందుచేత ఆర్కెస్ట్రాలో చేరాను. చిన్న చిన్న స్టేజి నాటకాలు కూడా వేస్తుంటాను. అంతో ఇంతో ఆదాయం ఉంది. ఈరోజు నాటక రంగానికి అంతగా ఆదరణ లేదు. అయినా నాకు అందుబాటులో ఉన్న విద్య తెల్సిన విద్య అదే. అందుకే నాటక కళాకారిణిగా జీవితం కొనసాగిస్తూ బాబుని పెంచుకుంటున్నాను. అంతంత మాత్రపు ఆ సంపాదనే నా జీవనాధారం.


కాని నా దురదృష్టం బాబుకి కొంత కాలంగా కడుపు నొప్పి వస్తూంది. నొప్పి వచ్చినప్పుడు గిల్లగిల్లాడి పోతున్నాడు. అపెండిసైటిస్ సంబంధం అని, ఆపరేషన్ చెయ్యాల్సి వస్తుందని, జాగ్రత్తగా వుండమని డాక్టర్లు చెప్పారు. గవర్నమెంటు హాస్పటల్ కి తీసుకెడితే నా బిడ్డ నాకు దక్కుతాడన్న ధైర్యం నాకు లేదు. ప్రవేటు నర్సింగ్ హోమ్ కి వెడితే రెండు మూడు వేలు పైగా ఖర్చు అవుతుందని తెల్సింది. పూట గడవటం కష్టం అయిన నేను అంత డబ్బు ఎక్కడ్నుంచి తేగల్ను?

కాని అలా అని బిడ్డని మాత్రం ఒదులుకోగల్నా?

నా బిడ్డని మీ చేతుల్లో పెడితే చిరంజీవి అయి నూరేళ్ళు సుఖంగా వుంటాడని నా తాపత్రయం. కాని డబ్బు లేకుండా మీ ముందు ఎలా నిల్చోగల్ను?

ఎన్నో రోజులుగా ఈ వేదన నన్ను దహించి వేస్తోంది. చాలాసార్లు మీ దగ్గరికి వచ్చి అర్థిద్దామనుకున్నాను. కాని ధైర్యం చాలాలేదు. మీరు కుదరదు అంటే తట్టుకునే శక్తి నాకు లేదు.

బాబుకి ఏదో ఒక రోజు ఆపరేషన్ చెయ్యవలసిన ప్రమాదస్థితి ముందుకు వస్తుంది. ఎటూ



తోచని స్థితిలో వేదనలో నలిగిపోతున్నాను.

ఒకోసారి చాలా చిన్న ఆపరేషన్ ఫెయిల్ అవుతుంది. ఇంకొక సారి చాలా క్లిష్టమైన కేసు పేషెంటు బ్రతకడని ఆశ వదులుకున్న కేస్ సక్సెస్ అవుతుంది. అందుకు కారణం కేవలం పేషెంటు అదృష్టమే కాదు. డాక్టరు ప్రతిభ కూడా. నాకు అదృష్టం మీద నమ్మకం లేదు. అందుకే ప్రతిభావంతుడైన డాక్టరు చేతిలో నా బిడ్డని పెట్టాలని నా ఆశ. దీనికి కారణం నా మాతృప్రేమే. ఈ విశాల ప్రపంచంలో నాకు వాడు. వాడికి నేను.

బిడ్డని దక్కించుకోవాలన్న ఆరాటంతో సాహసం చేశాను. దైవం లాంటి మిమ్మల్ని మోసం చేశాను.

ఆఖరికి నిన్న రాత్రి బాబు వున్నట్లుండి కడుపు నొప్పితో మెలికలు తిరిగిపోసాగాడు. అంతకు ముందు రెండుసార్లు కంటె నొప్పి తీవ్రంగా వచ్చింది. బాధని తట్టుకోలేక నలివిల అయిపోతున్నాడు. కళ్ళు తేలిపోతున్నాయి. ఆపరేషన్ తప్పని సరి అనిపించింది.

అంతే. ఎన్నో రోజులుగా నా మనసులో రూపు దిద్దుకున్న ఆలోచన కార్యరూపం దాల్చింది.

భగవంతుని పై భారం వేశాను.

అంతకు ముందు రోజు కళా పరిషత్ నిర్వహించిన నాటకంలో ''చింతవాణి''గా నటించి వచ్చాను.

ఇంకా ఆ గిల్ట్ నగలు పట్టు చీరలు నా దగ్గరే ఉన్నాయి. అవి సంస్థ వారికి అందచెయ్యలేదు. అప్పటికప్పుడు ఆ పట్టు చీర నగలు ధరించాను. ధనవంతురాలిగా మీ ముందు నిలిచాను. బిజినెస్ మాగ్నెట్ రాంగోపాల్ గారి పేరు వినటమే గాని ఇంత వరకు నేను ఆయన్ని చూడలేదు. కాని వాళ్ళ కుటుంబ వివరాలు కొన్ని తెలుసు. మీరు వాళ్ళ ఫామిలి డాక్టరు అని కూడా తెలుసు. నా నటన వాచికాభినయంతో మీ ముందు నిల్చున్నంత సేపూ నా మనసు నొచ్చుకుంటూనే వుంది. నా అబద్ధం. మోసం నా బిడ్డకి కీడు చేస్తుందేమో నని నా అంతరాత్మ ఘోష పెడుతూనే ఉంది. అయినా ఒకతల్లిగా నా బిడ్డ ప్రాణం నిలుపుకోవటం కోసం ధైర్యం తెచ్చుకున్నాను.

నా బిడ్డకి ప్రాణదాతలు మీరు. ''వైద్యో నారాయణహరి:'' అన్నారు పెద్దలు. ఈ ఆపరేషన్ వల్ల మీకు ఒక మూడు వేలు దాకా నష్టం కావచ్చు. ఒక ధనికునిగా డబ్బు విలువ ప్రాణం విలువ తెలిసిన వ్యక్తి రాంగోపాల్ గారు. నా బిడ్డని శపించక ఆశీర్వదించాలని నా కోరిక. నా బిడ్డ మీది ప్రేమలాంటి తాజా గులాబీలు కనుకగా ఇచ్చాను మీకు. పసిబిడ్డల జీవితాలు పూలలాంటివి. ఒక పూవు వాడిపోకుండా రక్షించానని అనుకోండి. నా బిడ్డని ఆశీర్వదించండి. ఈ పుణ్యం మీకు ఊరికే పోదు. మీ బిడ్డలని ఉన్నతులుగ చేస్తుంది. ఈ పిచ్చి తల్లిని క్షమించండి. ఏనాటికైనా నాకు మంచి సంపాదన వుంటే నాకుగా నేను మీ వద్దకే వచ్చి ఫీజు చెల్లించుకుంటాను. కాని నా జీవితంలో అంత అదృష్టం వస్తుందన్న ఆశ లేదు నాకు. మరోసారి మన్నించమని వేడుకుంటూ—

అరుణ (అంజని)

★ ★ ★

ఉత్తరం చదివిన నందకుమార్ ముఖం ఒక్క క్షణం ఆవేశంతో జేవురించింది. ఒక నటి... పూర్ ఉమెన్ తనని మోసం చేస్తుందా?

అతని కళ్ళు ఆవేశంతో జ్వలించాయి.

మళ్ళీ అంతలోనే అతని చదువు వివేకం వెన్ను తట్టాయి.

డాక్టర్లు పట్టా పుచ్చుకుంటు చేసిన ప్రమాణం జ్ఞాపకం వచ్చింది.

తండ్రి తన చదువు కోసం ఇల్లు వాకిలి అమ్మాడు. ఆఖరికి తన తల్లి మెళ్ళోని పుస్తెల తాడు కూడా తాకట్టుకి వెళ్ళిపోయింది.

వేలు ఖర్చుపెట్టి డాక్టరు చదివి బోర్డు పెట్టింది. ఉచిత వైద్యం చెయ్యటానికి కాదు. ముందు తనకి భుక్తి గడవాలి. తను డబ్బు తీసుకున్నా ఎందరికో ప్రాణదానం చేస్తున్నాడు. డబ్బు పోతే సంపాదించుకోవచ్చు. కాని ప్రాణం పోతే సంపాదించుకోలేం. తను ఎవర్ని వేధించటం లేదు. డబ్బు ఖర్చుపెట్ట గలిగిన వాళ్ళు తన దగ్గరికి వస్తున్నారు. పేదల కోసం ప్రభుత్వం ఆసుపత్రులున్నాయి. కాని అవి అవినీతికి నిలయాలు కావటం తన తప్పు కాదు. తను డబ్బు మనిషే కావచ్చు. కాని తను మనసున్న మనిషి కూడా'' అనుకుంటు నందకుమార్ కళ్ళు మూసుకున్నాడు...

కడుపు పట్టుకుని బెంచిమీద మెలితిరిగి పోతున్న ఆ పసివాడి తల్లి భుజం మీద తల పెట్టుకొని నీరసంతో, సిగ్గుతో, చిన్ని నవ్వు నవ్వుతూ తనకి నమస్కారం చేసిన బాబు... కళ్ళనిండా మాతృమమకారం కురిపిస్తూ తన కృతజ్ఞతలు తెలుపుకొన్న ఆ యువతి కళ్ళ ముందు కదిలింది.

అతని పెదవుల మీద చిన్న సంతృప్తితో కూడిన చిరునవ్వు కదిలి మాయం అయ్యింది.

''డాక్టర్ పేషెంట్స్‌ని పంపించమంటారా? నాలుగైంది'' కర్టెన్ తొలగించుకుని నర్సు లోపలికి వచ్చింది.

అతి కష్టంతో ఆలోచనల్ని పక్కకి పెడుతూ ''ఎస్'' అన్నాడు

# సామెతలు

1) అందరికీ అదృష్టం పలికే బల్లి — తను గంజిలో పడింది.
2) దాసీ పుత్రుడైనా, శ్రీమంతుడైతే అతడు మహారాజే.
3) చిరకాల స్నేహితుడు వంటి దర్పణం మరోటి లేదు.
4) వాన రాకడా, ప్రాణం పోకడా ఎవ్వరికీ తెలియదు.
5) అడవి కాసిన వెన్నెల బూడిదలో పోసి పన్నీరు.
6) సౌందర్యం, వికారం రెండూ వృద్ధాప్యంలో ఒకే రీతిగా పోతాయి. ఒకటి సహజంగా పోతుంది, మరొకటి కప్పబడిపోతుంది.
7) చిరకాలం జీవిస్తామనే అభ్యసించాలి, రేపు మరణిస్తామనే జీవించాలి.
8) ఎవరు ఏం చేయగలిగేది ఎవరికీ తెలియదు ప్రయత్నించే దాకా.
9) మాటలకు చేతలకు మధ్య ఎంతో అంతరం.
10) అందరూ పల్లకీ ఎక్కితే మోసే వాళ్ళెవరు?
11) కష్టాలలో నిరాశ ఎందుకు? నల్లటి మేఘాలే మంచి వర్షం కురిపిస్తాయి.
12) ఆదివారం అందలం, సోమవారం జోలె.
13) విరోధి నుంచి అయినా సరే విజ్ఞానం పొందగలం.
14) దూరపు కొండలు నునుపు.
15) ఎంత ప్రియమైనా విజ్ఞానం మంచి కొనుగోలు.
16) అందితే జుట్టు లేకపోతే కాళ్ళు.
17) మూర్ఖులతో స్నేహం కంటే, విజ్ఞులతో వైరం మంచిది.
18) ఇబ్బందుల వల్ల అనుభవం, అనుభవం వల్ల విజ్ఞానం.
19) పేరు పోగొట్టుకున్న మనిషి సగం చచ్చిన మనిషి.
20) దుర్బలత్వం వల్లే క్రూరత్వం.
21) కాలాన్ని సద్వినియోగం చేసుకునే వారికి తీరికే ఉండదు.
22) పేరు ప్రతిష్టల విలువ బాధ్యత.

— ముద్దా రమణమూర్తి.